క్లుప్తంగా

దుకాణాలకు లేబర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



వ్యాపార సంఘాల నాయకులతో మాట్లాడుతున్న బషీరున్నిసా బేగం

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని దుకాణాలకు లేబర్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో లేబర్ ధ్రువీకరణ పత్రం గురించి వివిధ వర్తక, వ్యాపార సంఘాల నాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం-2015 ప్రకారం దుకాణాల యజమానులు తప్పనిసరిగా తమ వివరాలు మీసేవలో నమోదు చేసి లేబర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఈ నెల 29వ తేదీలోగా పొందాలని సూచించారు. సహాయ కార్మిక అధికారులు విద్యావతమ్మ, సమీర్, మురళీకృష్ణ, రెడిమేడ్ అసోసియేషన్ సంఘం సభ్యులు నరసింహరాజు, సత్యంరెడ్డి, కిరాణం అసోసియేషన్ సభ్యులు అల్లూరయ్య, నాగప్రసాద్ పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



కోటకొండలో గొడుగుతో బైక్‌పై వెళ్తున్న రైతు

రుద్రవరం: కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో కాస్త చలి ఉన్నప్పటికీ ఉదయం పది గంటలు దాటిన తరువాత నుంచి ఎండ తీవ్రత మొదలవుతోంది. మధ్యాహ్నం రెండు గంటలు దాటినప్పటి నుంచి ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటుతోంది. పశువుల కాపరులు,పొలాలకు వెళ్లిన కూలీలు,రైతులు ఎండబారిన పడకుండా ఉండేందుకు అప్పుడే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం కోటకొండలో ఓ రైతు మోటార్ సైకిల్‌పై గొడుగును అమర్చుకొని ఆ నీడన ఇంటికి చేరుకున్నాడు.

వేతన సవరణ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రయోజనం కల్పించే మెరుగైన వేతన సవరణను ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో అజాంబేగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ అమలులో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలన్నారు. సుబ్బయ్య, నాగేంద్ర, కుమార్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు



మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ కార్యక్రమాల అనంతరం స్వామి వారికి పట్టువస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం స్వాతి పల్లకీసేవా సమితి ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో స్వామి వారికి పల్లకీసేవ చేపట్టారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



ఆళ్లగడ్డలో కవాతు చేస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ: చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ రమేష్‌బాబు తెలిపారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఎస్‌ఐ నగీన ఉన్నారు.

ప్రారంభోత్సవానికి వేళాయె

- యర్రగుంట్లలో రూ.42 లక్షలతో 9 సిమెంట్ రోడ్లు పూర్తి
- రూ. 35 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే



కాపు పేటలో వేసిన సిమెంట్ రోడ్డు



నూతనంగా వేసిన సీసీ రోడ్డు



నేడు ప్రారంభించనున్న బ్రిడ్జి

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రూ.కోట్లాది పనులు జరిగాయి. టీడీపీ పాలనలో ఉన్న మట్టి రోడ్లు నేడు సీసీ రోడ్లుగా మార్పు చెందాయి. దీంతో ఆయా వార్డుల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యర్రగుంట్లలో జరిగిన పలు అభివృద్ధి పనులను ఈ నెల 3వ తేదీన జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి పథకం నిధులు రూ.42 లక్షలతో వేసిన 9 సిమెంట్ రోడ్లు, వరద నిధులు రూ.35 లక్షలతో పూర్తి చేసిన బ్రిడ్జిని ప్రారంభిస్తారు. కాపు పేటలోని గ్రామ పంచాయతీ వరకు సిమెంట్ రోడ్డు, కోట వీధి, గాయత్రి స్కూల్ ఏరియా, కురువ పేటలో సిమెంట్ రోడ్ల వేశారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాల నుండి ఎస్సీ కాలనీ మధ్యనున్న బ్రిడ్జిని ప్రారంభిస్తారు.

నేడు శిరివెళ్లకు ఎమ్మెల్యేక రాక

ఈ నెల 3వ తేదీ ఉదయం శిరివెళ్లకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పుణ్యవతి శుక్రవారం తెలిపారు. ఆసరా పథకం కింద మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు రుణమాఫీ తుది విడత నిధులను జమ చేస్తారని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొనాలని కోరారు.

పల్స్‌పోలియోపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్ : మార్చి 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంపై శుక్రవారం సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ భవానీ, జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. డాక్టర్ కాంతారావ్ నాయక్, జగదీష్ చంద్రరెడ్డి, సునీత,చెన్న కేశవులు, రూపేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

9న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ..

పిల్లలలో నులిపురుగుల నిర్మూలనకు ఫిబ్రవరి 9వ తేదిన 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం' సందర్భంగా 1-19 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 4,11,270 మందికి ఆల్బెండజోల్ -400 మి.గ్రా. మాత్రలు వేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా శుక్రవారం భూమిపూజ చేశారు. 35వ వార్డులో కౌన్సిలర్ బాషీద్ ఆధ్వర్యంలో రూ.10లక్షల జనరల్ ఫండ్ నిధులతో డివైడర్ నిర్మాణం, రూ.10 లక్షల కుడా (కర్నూలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ)తో పెయింటింగ్ పనులు. 33వ వార్డులో కౌన్సిలర్ ఎద్దు మనోరంజని ఆధ్వర్యంలో రూ.20లక్షలతో డివైడర్ నిర్మాణం, రూ.35 లక్షలతో ఆర్ట్ పెయింట్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి బొమ్మలసత్రం వరకు, ఎన్జీఓ కాలనీలో డివైడర్లకు పెయింటింగ్ పనులకు భూమి పూజ చేశారు.

పెండింగ్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఎస్పీ

నంద్యాల: ఎన్నికల సంఘం సూచించిన తాజా ఆదేశాలను పరిగణలోనికి తీసుకొని పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేశ్‌కుమార్ మీనాకు తెలిపారు. శుక్రవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ఎన్నికల సన్నద్ధత, ఎలక్టోరల్ రోల్ ఫార్మ్ 6, 7, 8ల పెండింగ్, పోలింగ్ కేంద్రాల సదుపాయాలు, భద్రత, వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, కౌంటింగ్ సెంటర్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా జనవరి 22వ తేదీ ప్రచురణకు ముందు ఫారం-6, 7, 8లకు సంబంధించి 17,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, జనవరి 23 నుంచి ఇప్పటి వరకు 8,991 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటన్నింటినీ ఇంటింటి వెరిఫికేషన్ చేయించి జాబితాలో పొందుపరుస్తామన్నారు. 18-19 సంవత్సరాల యువ ఓటర్లు 21,738 మంది ఉన్నారని కళాశాలలు, విద్యాసంస్థలలో ఓటర్ నమోదు స్పెషల్ కాంపెయిన్‌లు నిర్వహించి నమోదుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డోన్‌లో 7 పోలింగ్ స్టేషనులకు ర్యాంపులు, నందికొట్కూరులో ఐదు పోలింగ్ స్టేషన్లకు టాయిలెట్ల ఇబ్బంది ఉందని త్వరగా పూర్తి పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఆర్‌ఓ, నంద్యాలలో ఈఆర్‌ఓ, గడివేముల పాములపాడు, అవుకు, నంద్యాల రూరల్‌లో ఏఈఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిషన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుకు సంబంధించిన నివేదిక ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు పంపి ఆమోదం పొందిన తర్వాతనే జాబితాలో తొలగించాలని ఆదేశించారు. ఆత్మకూరు, డోన్ ఆర్‌డీఓలు దాసు, వెంకటరెడ్డి, నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు



విజేత జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో శుక్రవారం ముగిశాయి. పట్టణంలోని ఇండోర్ స్టేడియం, ఎస్పీజీ క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొని క్రీడాకారులను అభినందించారు. నంద్యాల, నందికొట్కూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. జిల్లా స్థాయి వాలీబాల్ బాలుర పోటీల్లో బనగానపల్లె ప్రథమస్థానం, శ్రీశైలం రెండవ స్థానం, మూడోవ స్థానం ఆళ్లగడ్డ జట్లు దక్కించుకున్నాయి. బాలికల వాలీబాల్‌లో మొదటి స్థానం నందికొట్కూరు, రెండో స్థానం ఆళ్లగడ్డ, మూడో స్థానం బనగానపల్లె జట్లు నిలిచాయి. బాలుర కబడ్డీ పోటీల్లో డోన్, నందికొట్కూరు, నంద్యాల జట్లు వరుస స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో నంద్యాల, పాణ్యం, ఆళ్లగడ్డ వరుస స్థానాల్లో నిలిచాయి. బాలుర బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాల, నందికొట్కూరు, డోన్ జట్లు గెలుపొందాయి. బాలికల విభాగంలో నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, ఖోఖో బాలికల పోటీల్లో ఆళ్లగడ్డ మొదటి స్థానం, రెండో స్థానంలో డోన్ నిలిచింది. నియోజకవర్గ స్థాయి పది ఓవర్ల మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన నందికొట్కూరు టీం 71 పరుగు చేయగా నంద్యాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో బాలురు క్రికెట్ పోటీల్లో మిడుతూరు జట్టుపై నందికొట్కూరు విజేతగా నిలిచింది. మూడో స్థానంలో లింగాపురం జట్టుపై శ్రీశైలం జట్టు విజయం గెలుపొందింది. బాలికల క్రికెట్ పోటీల్లో వైఎస్సార్ నగర్ జట్టుపై డోన్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ఉన్న కొండాపురం జట్టుపై ఆళ్లగడ్డ జట్టు గెలిచిందని క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. విజేతలకు శనివారం బహుమతులు అందజేస్తామని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌గా నిరంజన్‌రెడ్డి



నిరంజన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్, తదితరులు

నంద్యాల(సిటీ): పట్టణ వాసులు, అధికారులు, సిబ్బంది సహకారంతో నంద్యాల పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని నూతన మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రవిచంద్రారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడారు..

గిద్దలూరు నుంచి..

ప్రకాశం జిల్లా గిద్దలూరు తన స్వగ్రామమన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా 1999లో మున్సిపల్ అధికారిగా మొదలై పలు మున్సిపాలిటీల్లో, వివిధ స్థాయిలో విధులు నిర్వర్తించానన్నారు. ముందుగా నూజివీడు, సత్తెనపల్లి, భీమునిపట్నం, హైదరాబాద్ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ ఆఫీసర్, గూడూరు, కందుకూరు, బాపట్ల, కావలి, తాడేపల్లిగూడెం, కడప, ఒంగోలు కార్పొరేషన్, అడిషనల్ కమిషనర్ గుంటూరు, మంగళగిరి (కార్పొరేషన్ మొదటి కమిషనర్), ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నుంచి నరసరావు పేట ట్రాన్స్‌ఫర్ ఆ తర్వాత నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చానన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్ద పీట..

నంద్యాల పట్టణంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తానన్నారు. ముఖ్యంగా శానిటేషన్, నీటి సరఫరా, ఎన్‌క్రోచ్‌మెంట్లు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రతి ఒక్కరికీ అందిస్తానన్నారు. ఏవైనా ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పారిశుద్ధ్య మెరుగు కోసం వారోత్సవాలను నిర్వహించి వార్డులో ఫాగింగ్, స్ప్రేయింగ్, డిసిల్టేషన్, కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల నివారణకు కుంటల్లో గంబూషియా చేపలను వదలడం లాంటి పనులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కారినికి చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, ఇతర శాఖాధిపతులు, ఇన్‌చార్జ్ ఆర్‌ఓ వెంకటకృష్ణ, సిబ్బంది, సచివాలయ అడ్మిన్లు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



ఆర్.పాంపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులు పేదలకు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని సర్పంచ్ చాబోలు లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ కందుల వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లె సచివాలయ పరిధిలోని ఆర్.పాంపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, శివలింగమ్మ 770 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. గ్రామంలోనే గుండెకు సంబంధించిన పరీక్షలు, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, నాయకులు శ్రీనివాసరెడ్డి, మధుబాబు, పంచాయతీ కార్యదర్శి సుచరిత పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పులిమద్ది గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యాధికారి షహలం, కంటి వైద్య నిపుణులు నారాయణ రెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు సర్పంచ్ రఘురామిరెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి నాయక్, మాజీ సర్పంచ్ నారాయణ ఉన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(సిటీ): పట్టణంలోని తెలుగుపేటకు చెందిన మిడుతూరు తుఫాన్ గుండెపోటుతో తన నివాసంలో శుక్రవారం మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో నామినీగా ఉన్న మిడుతూరు నాగమణికి బీమా తక్షణ సాయం కింద రూ.10వేల నగదును కౌన్సిలర్ శిరీష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, వార్డు సచివాలయ వెల్ఫేర్ సుధాకర్, వలంటీర్లు దుర్గాప్రసాద్, వదరరాజు అందజేశారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

గోస్పాడు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ నంద్యాల అసెంబ్లీ కన్వీన ర్ అభిరుచి మధు తెలిపా రు. మండల కేంద్రంలో శుక్రవారం గ్రామస్థాయి కన్వీనర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఈనెల 9న నిర్వహిస్తామన్నారు. రామకృష్ణ, సుబ్బారెడ్డి, నాగేంద్రబాబు, మధుగోపాల్ పాల్గొన్నారు.

రుద్రవరం ఎంపీడీఓగా రామచంద్ర

రుద్రవరం : ఎంపీడీఓగా రామచంద్రను జిల్లా అధికారులు నియమించినట్లు మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డిని వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేశారు. అలాగే అక్కడి నుంచి బదిలీపై వచ్చిన వారిలో రామచంద్రను రుద్రవరం మండలానికి కేటాయించారని, శనివారం బాధ్యతలు చేపడతారని ఆమె చెప్పారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



ఆర్.పాంపల్లెలో బాషాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగబ్రహ్మం

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ 92 శాతం పూర్తయ్యిందని పరిపాలనాధికారి పార్థసారథి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 3,994 మంది లబ్ధిదారులకు గానూ ఇప్పటి వరకు 3,676 మందికి 11 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు రూ.1,08,57,500 నగదు పంపిణీ చేశారని వివరించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ ఇస్తున్న వలంటీర్ బాలవెంకటసుబ్బయ్య

నంద్యాల(అర్బన్): పోలూరు గ్రామానికి చెందిన దేరెడ్డి అచ్చెమ్మ అనారోగ్యంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ బాలవెంకటసుబ్బయ్య శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి వితంతు పింఛన్ సొమ్ము అందజేశారు.

కోటేష్ చిత్రానికి అవార్డు

నంద్యాల(అర్బన్): హైదరాబాద్‌కు చెందిన సాగంటి ఆర్ట్ అకాడమీ సినీ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం పుట్టిన రోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 1న నిర్వహించిన బ్రహ్మానందం ఊహాచిత్రం ఆర్ట్ పోటీల్లో నంద్యాల చిత్రకారుడు కోటేష్ చిత్రానికి ద్వితీయ బహుమతి లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 330 మంది చిత్రకారులు పోటీలకు చిత్రాలు పంపారని, తాను గీచిన చిత్రానికి ద్వితీయ బహుమతి వచ్చిందని, అవార్డును బ్రహ్మానందం చేతుల మీదుగా త్వరలో అందుకోనున్నట్లు కోటేష్ శుక్రవారం తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

దొర్నిపాడు: మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. అమ్మిరెడ్డి నగరానికి రూ.69,816, అర్జునాపురం 61,344, బుర్రారెడ్డిపల్లె రూ.1,31,110, చాకరాజువేముల రూ.3,71,843, దొర్నిపాడు రూ.4,81,880, గుండుపాపల రూ.1,80,173, కొండాపురం రూ.1,02,782, క్రిష్టిపాడు రూ.1,65,321, రామచంద్రాపురం రూ.1,13,601, డబ్ల్యూ గోవిందిన్నె రూ.2,33,663, డబ్ల్యూ కొత్తపల్లె రూ.2,12,502 వచ్చినట్లు చెప్పారు.

28లోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోండి

నంద్యాల(సిటీ): పట్టణంలోని వర్తక వాణిజ్య సముదాయాల్లోని దుకాణాలకు 2024-25వ ఆర్థిక సంవత్సరానికి గాను ట్రేడ్ లైసెన్స్ డిమాండ్ జనరేట్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని కిరాణ, ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, బార్‌లు, షాపింగ్ మాల్స్, బేకరి, సినిమా థియేటర్లు ఇతర దుకాణాలు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28వ తేదీలోపు ట్రేడ్ ఫీజు చెల్లించి తమ ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం

నంద్యాల(సిటీ): మహిళలు అన్ని రంగాలలో రాణించేలా, వారి అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత వారోత్సవాలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ హాజరై మాట్లాడారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

దొర్నిపాడు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ బిత్రా రఘువీర్, సీఐ హనుమంతునాయక్ తెలిపారు. మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఏఎస్‌ఐ ప్రతాపరెడ్డి ఉన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం



డీఆర్‌ఓను సన్మానిస్తున్న జేసీ, తదితరులు

నంద్యాల(అర్బన్): బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య, ఏఓ శ్రీనివాసులును స్థానిక కలెక్టర్‌రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, నూతన డీఆర్‌ఓ పద్మజ, పలువురు రెవెన్యూ అధికారులు వారిని సత్కరించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులును రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.